క్లుప్తంగా

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి



నిరసన తెలియజేస్తున్న వామపక్షాల నేతలు

నెల్లిమర్ల: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని వామపక్షాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక మొయిద జంక్షన్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ న్యూ డెమక్రసీ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలు పెంచి సామాన్య ప్రజానీకంపై పెనుభారం వేశాయన్నారు. ముఖ్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలోకి వచ్చిన తర్వాత మరోలా మాట్లాడి విద్యుత్ సంస్కరణల పేరిట చార్జీలు పెంచడం దారుణమన్నారు. కార్యక్రమంలో వామపక్షాల నేతలు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ల అప్పలసూరి, తదితరులు పాల్గొన్నారు.

ధర్మాన్ని అనుసరించాలి



రేగిడి విశ్వసాయి మందిరంలో మురళీమాస్టర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

రేగిడి: ప్రతి ఒక్కరూ ధర్మాన్ని కాపాడాలని ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు సాయిమురళీ మాస్టర్ అన్నారు. శనివారం స్థానిక విశ్వసాయి మందిరంలో ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో నడవాలని, ఇతరులకు హాని చేయరాదని సూచించారు. ఇతరులకు సేవచేయడంలోనే పరమార్థం ఉందని, ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలన్నారు. అనంతరం మురళీ మాస్టర్‌ను సత్యసాయి భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్, లావేటి విష్ణు ఘనంగా సత్కరించారు.

క్రీడాస్ఫూర్తితో మెలగాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ ప్రశాంత కిషోర్ మహంతి

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో మెలగాలని వీసీ ప్రొఫెసర్ ప్రశాంత కిషోర్ మహంతి పిలుపునిచ్చారు. జాతీయ చదరంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని టెక్కలి సెంచూరియన్‌లో చెస్, వాలీబాల్, క్రికెట్, బాస్కెట్ బాల్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి ఉన్నత స్థానాల్లో స్థిరపడిన క్రీడాకారులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం పరిశోధన పత్రాల తయారీ అంశంపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. నాక్ గుర్తింపునకు పరిశోధనా పత్రాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో వర్సిటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా పత్తిపంట

రాజాం: మండలంలోని అంతకాపల్లి, అమరాం, ఆగూరు, గడిముడిదాం, తదితర గ్రామాల్లో సాగు చేస్తున్న పత్తి పంట ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం ఈ పంట తొలిదశ పూతకు చేరుకుందని వ్యవసాయశాఖ ఏఓ రేణుకాసాయి తెలిపారు. పత్తి పంట నాలుగు నుంచి ఆరు పర్యాయాలు పూతకు వస్తుందని, ఈ ఏడాది మండలంలో 274 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారని చెప్పారు. అనుకూల వాతావరణం ఉండడంతో ఎకరాకు తొలి దశలో ఖర్చులు పోనూ రూ. 20 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని వివరించారు. రైతులు సాగుచేస్తున్న ఈ మొత్తం పంటను ఈ క్రాప్‌లో నమోదు చేసినట్లు తెలిపారు.

నేటి నుంచి ధర్మ ప్రచార వారోత్సవాలు



పోలిపల్లి పైడితల్లి

రాజాం: పట్టణంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం నుంచి వారం రోజుల పాటు ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహించనున్నారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో సనాతన హిందూ ధర్మ పరిరక్షణతో పాటు హిందూ ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా వీటిని నిర్వహించనున్నట్లు ఈఓ బీవీ మాధవరావు శనివారం వెల్లడించారు. ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి 8 వరకు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రవచనాలు, సంత్సంగాలు నిర్వహించనున్నట్లు అర్చకుడు వేమకోటి సూర్యనారాయణశర్మ తెలిపారు. వారం రోజుల పాటు పైడితల్లికి విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- లెండిలో ఫ్రెషర్స్ డే వేడుకలు
- హాజరైన వివిధ విభాగాలకు చెందిన ప్రముఖులు



జ్యోతి ప్రజల్వన చేస్తున్న ఇన్వెనియో సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సీఈఓ తిరుమల రమేష్ నాయుడు

డెంకాడ: జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ కంప్యూటర్స్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సిస్టమ్ ఇంజినీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విభాగాల్లో ఫ్రెషర్స్ డేను సందడిగా నిర్వహించారు. జూనియర్ విద్యార్థులను సీనియర్ విద్యార్థులు సహృద్భావ వాతావరణంలో ఆహ్వానించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో కళాశాల ప్రాంగణంలో సందడి నెలకొంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్‌కు చెందిన ఇన్వెనియో సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సీఈఓ తిరుమల రమేష్‌నాయుడు మాట్లాడుతూ, మంచి అభిరుచితో ఇంజినీరింగ్ పూర్తి చేస్తే ఎటువంటి ఆటంకాలు ఎదురైనా మంచి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. గాయత్రి మెడికల్ కళాశాల ప్రొఫెసర్ ఏవీ సుభాష్ మాట్లాడుతూ, నిరంతర సాధనతోనే విజయాలు అందుకోవచ్చని చెప్పారు. ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు మాట్లాడుతూ, విద్యార్థులు నైపుణ్యం కోసం నిత్యం పరితపించాలన్నారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.ఎస్పీ కుమార్ మాట్లాడుతూ, విద్యా ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. ఎన్ఎస్‌పీఎల్ సైంటిస్ట్ డాక్టర్ బి.రామకృష్ణ మాట్లాడుతూ, సమాజానికి మెకానికల్ ఇంజినీర్ల ద్వారా అందుతున్న సేవలను వివరించారు. డీఆర్‌డీఓ, బార్క్, ఇస్రో, తదితర సంస్థలు చేపడుతున్న రక్షణ పరిశోధన కార్యకలాపాలు, క్షిపణులు పనిచేసే విధానాన్ని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి మాట్లాడుతూ, ఇంజినీర్ల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. లెండి ఇంజినీరింగ్ కళాశాలలో చదువుకుని ఉన్నత స్థితిలో ఉన్న పలువురు పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ పి. శ్రీనివాసరావు, సెక్రటరీ, కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ తమ్మినేని హరిబాబు, కేవీ నరసింహం, ప్లేస్‌మెంట్ డీన్ జి. ప్రకాష్‌బాబు, విభాగాధిపతులు ఎస్. రాజన్‌బాబు, రామారావు, సుబ్బరామయ్య, రాజేంద్ర, వి.ప్రసాద్, జి.సతీష్, సతీష్ పూజారి, పీడీ శైలజ, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థిని



దేశభక్తి గీతానికి నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మోదీతోనే ఉజ్వల భవిష్యత్

- కేంద్రమంత్రి నారాయణస్వామి



కేంద్రమంత్రి నారాయణస్వామికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు

విజయనగరం టౌన్: దేశ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోనే భారతదేశం ఉజ్వల భవిష్యత్‌ను సాధించుకుంటోందని కేంద్ర సామాజిక, న్యాయ సాధికారికత శాఖ సహాయమంత్రి ఎ. నారాయణ స్వామి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నడుకుదిటి ఈశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ, కేంద్రం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటగిరి నారాయణరావు, కుసుమంచి సుబ్బారావు, బవిరెడ్డి శివప్రసాదరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్లు, మోర్చా అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి దృష్టికి దివ్యాంగ బాలల సమస్యలు

విజయనగరం అర్బన్: రాష్ట్రంలోని దివ్యాంగ బాలలు ఎదుర్కొంటున్న సమస్యల్ని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రి ఎ.నారాయణ స్వామి దృష్టికి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తీసుకెళ్లారు. పట్టణానికి వచ్చిన మంత్రిని శనివారం కలసి పలు సమస్యలు వివరించారు. విశాఖపట్టణం, విజయవాడ, తిరుపతి పట్టణాల్లో బాల, బాలికలకు వేర్వేరుగా పరిరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వమే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

యువతకు ప్రాధాన్యం

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు ఈశ్వర్ కౌశిక్



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వర్ కౌశిక్

విజయనగరం: యువతకు మంచి భవిష్యత్ ఇచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్ అన్నారు. నగరంలోని 22, 44వ డివిజన్‌ల పరిధిలో విద్యార్థి, యువజన విభాగాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ, నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడుతున్న నేత ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి అని కొనియాడారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని తెలిపారు. విజయనగరం ఎంతలా అభివృద్ధి చెందిందో ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో ఆయా డివిజన్ కార్పొరేటర్లు, విద్యార్థి, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

విశాఖలో రాజధాని ఏర్పాటు చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సమితి ప్రతినిధులు

విజయనగరం ఫూల్‌బాగ్: విశాఖపట్నాన్ని పరిపాలనా రాజధానిగా ఏర్పాటు చేయాలని విశాఖపట్నం పరిపాలన రాజధాని సాధన సమితి కన్వీనర్ బి భానుమూర్తి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక బాలాజీ జంక్షన్‌లోని అంబేడ్కర్ భవనంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, మైనార్టీల రాజ్యాధికార సాధన మూడు రాజధానులతో సాధ్యమన్న నినాదంతో రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు పి. మధుసూదనరావు, చిన్నం అరుణ్‌కుమార్, వంశీ, రాజ్‌కుమార్, జె. కృష్ణ, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఓం మందిరంలో కోటి కుంకుమార్చన



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఓం మందిరం కన్వీనర్ సన్యాసినాయుడు, తదితరులు

విజయనగరం టౌన్: పట్టణంలోని సాయినాథ్ కాలనీలో ఉన్న ఓం మందిరంలో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా 98వ జయంతి సందర్భంగా కోటి కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఓం మందిరం కన్వీనర్ జి.సన్యాసినాయుడు తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నేటి నుంచి ఈ నెల 24 వరకు ప్రతిరోజూ కోటి కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజూ ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సేవాదళ్ ఇన్‌చార్జ్ ఎస్.అనితాదేవి, కేవీ రమణ, పైడి శ్రీనివాసరావు, సీహెచ్.రామారావు, కె.మదన్‌మోహన్, బి.శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నెల్లిమర్ల: ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్, తదితర కాంట్రాక్ట్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బాలిగొరినాయుడు, కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



సిద్ధమైన రామనారాయణం

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన రామనారాయణంలో ఆదివారం నుంచి శరన్నవ రాత్రి మహోత్సవాలు ప్రారంభమవుతాయని ఎన్‌సీఎస్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ తెలిపారు. ఉత్సవాలకు సంబంధించి ఆహ్వాన ప్రతులను రామనారాయణం ప్రాంగణంలో శనివారం ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈ నెల 15 నుంచి 24 వరకు ప్రతి రోజూ కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలన్నారు.

సిరిమాను చెట్టుకు ప్రత్యేక పూజలు



సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ

నెల్లిమర్ల: జరజాపుపేటలో గుర్తించిన పైడితల్లి సిరిమాను చెట్టుకు భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

ఈ క్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ శనివారం చెట్టును దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పైడితల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అలాగే ఆర్డీఓ ఎంవీ సూర్యకళ, ఏఎస్పీ అస్మా పర్వీన్, తదితరులు చెట్టును దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో పైడితల్లి ఆలయ ఈఓ సుధారాణి, విద్యుత్‌శాఖ ఎస్ఈ లక్ష్మణరావు, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, తహసీల్దార్ డి. ధర్మరాజు, ఎస్సై నారాయణరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక



కొత్తవలస: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కొత్తవలస ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఎంఈఓ శ్రీనివాసరావు, హెచ్ఎం ఈశ్వరరావు



మెరకముడిదాం: జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన గర్భాం మోడల్ స్కూల్ విద్యార్థులతో ప్రిన్సిపాల్ అరుణ, పీడీ రాంబాబు

కొత్తవలస: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారని ఆ పాఠశాల పీడీలు ఎం.పాప, కె.కనకమహాలక్ష్మి శనివారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14,17 విభాగాల్లో ఎస్.కోట మండలంలోని వెంకటరమణపేట ఉన్నత పాఠశాలలో ఇటీవల జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో బాలికల విభాగంలో 10వ తరగతి విద్యార్థిని ఎం.లిషా, బాలురు విభాగంలో పి.దినేష్ సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థులను ఎంఈఓ బండారు శ్రీనివాసరావు, హెచ్ఎం చీపురుపల్లి ఈశ్వరరావు అభినందించారు.

జిల్లాస్థాయి పోటీలకు 15 మంది..

మెరకముడిదాం: మండలంలోని గర్భాం మోడల్ స్కూల్ విద్యార్థులు 15 మంది జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ పోటీ లకు ఎంపికయ్యారని ఆపాఠశాల ప్రిన్సిపాల్ డి.వి.ఎస్.అరుణ శనివారం తెలిపారు. ఇటీవల చీపురుపల్లిలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్ పోటీల్లో బాలురు, బాలికల విభాగాల్లో వీరు ఉత్త మ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయికి అర్హత సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ పి.రాంబాబు అభినందించారు.

దివ్యాంగులకు వరం గురుదేవా ట్రస్ట్

- కేంద్ర సహాయ మంత్రి నారాయణస్వామి



కృత్రిమ అవయవాల తయారీ విధానాన్ని కేంద్ర సహాయ మంత్రి నారాయణస్వామికి వివరిస్తున్న గురుదేవా ట్రస్ట్ చైర్మన్ జగదీష్‌బాబు

కొత్తవలస: గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ దివ్యాంగుల పాలిట వరమని కేంద్ర సామాజిక న్యాయ,సాధికారత శాఖ సహాయ మంత్రి ఎం. నారాయణ స్వామి అన్నారు. మండలం లోని మంగళపాలెం గ్రామ సమీపంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ వజ్రోత్సవాల్లో భా గంగా స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు,ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుతో కలిసి శనివారం ట్రస్ట్‌ను ఆయన సందర్శించారు. బుద్ధిమాంద్యం గల పిల్లలు,వారి తల్లులకు శిక్షణ ఇచ్చేందుకు ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కేంద్రాన్ని, ఫిజియోథెరఫీ ,స్పీచ్, హియరింగ్, న్యూరో ఫిజీషియన్ సెంటర్లను ఆయన ప్రారంభిం చారు. అలాగే ట్రస్ట్‌కు చెందిన సూపర్ స్పెషాలటీ ఆస్పత్రి, కృత్రిమ అవయవాల తయా రీ కేంద్రాన్ని పరిశీలించారు. కృత్రిమ కాళ్లు,చేతులు తయా రు చేసే విధానాన్ని ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఆయనకు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావే శంలో ఆయన మాట్లాడుతూ సేవచేస్తున్నట్లు వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ తదితర సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకునే సంస్థలు ఎక్కువైపోయాయని అసహనం వ్య క్తం చేశారు. వీటికి భిన్నంగా గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ దివ్యాంగుల సేవలో తరిస్తోందన్నారు. గత 25 ఏళ్లలో సుమారు 2లక్షల మందికి కృత్రిమ అవయవాలను అందించి వారీ జీవితాల్లో వెలుగులు నింపిన ట్రస్ట్ చైర్మన్ జగదీష్‌బాబు కృషి అభినందనీయమన్నారు. ట్రస్ట్ సేవాకార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా తమ వంతు సహకారం అందిస్తామన్నారు. దేశంలో ప్రతీ వ్యాపార సంస్థ, కంపెనీ సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ)లో భాగంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం పలువురు దివ్యాంగులకు ఉపకరణాలే అందజేశారు. అలాగే జానపద కళాకారులకు గజ్జెలు, చిడతలు,తాళాలు, దుస్తులు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.మాధవ్, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చా రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోలాల అమావాస్య పూజలు



జామి: పుష్పగిరిలో పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి

దత్తిరాజేరు: పోలాల అమావాస్య నేపథ్యంలో మండలంలోని దత్తి గ్రామంలో శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పత్యేక పూజలు నిర్వ హించారు. అర్చకులు కందాడ హరికృష్ణ ఆధ్వర్యంలో స్వామి వారికి మేల్కొలుపు, సుప్రభాత తదితర విశేష పూజలు చేశారు. చుట్టు పక్క గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ ధర్మకర్త పెంకి తిరుపతినాయుడు ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు.

సీతారాముల ఆలయంలో...

గజపతినగరం: స్థానిక సీతారాములు, శ్రీనివాస ఆలయంలో అర్చకులు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో..

జామి: మండలంలోని పుష్పగిరి గ్రామంలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు చేశారు. స్వామివారిని ఆలయ ప్రధాన అర్చకులు రవిస్వామి తులసీ దళాలు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తులు స్వామివారికి అభిషేకాలు చేశారు.